




# మనం మెదక్

సంగారెడ్డి సిద్దిపేట

శనివారం । 6 । జూన్। 2026 పేజీలు: 7


# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

**అర్బన్ ఆక్సిజన్ పార్క్‌లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్**



*ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రకృతి మనకు జీవనాధారం, స్ఫూర్తి, భవిష్యత్తుకు మార్గదర్శకం. నేడు వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని ఒక సందేశంలో పేర్కొన్నారు.*

2

# సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ సస్పెండ్



- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో లోపాలు
- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

3



# వర్షాకాలానికి ముందే జాతీయ రహదారి-65పై పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

సంగారెడ్డి-పటాన్చెరు మధ్య రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

2



# జాతీయ మెగా లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోండి

హుస్నాబాద్ కోర్టు జడ్జిలు బి. రేవతి, ఈ. ప్రమిద

పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కల నాటిన జడ్జిలు..

3



# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి









**సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అర్బన్ ఆక్సిజన్ పార్క్ లో మొక్కలు నాటిన మంత్రి పొన్నం ప్రభాకర్**

సిద్దిపేట రిపోర్టర్, జూన్05 మనం న్యూస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రకృతి మనకు జీవనాధారం, స్ఫూర్తి, భవిష్యత్తుకు మార్గదర్శకం. నేడు వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని ఒక సందేశంలో పేర్కొన్నారు.

ఒక మొక్క నాటడం, నీటిని ఆదా చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యలే రేపటి తరాలకు సురక్షితమైన, స్వచ్ఛమైన భూమిని అందించగలవని పేర్కొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించడానికి చెట్టు విలువ తెలుసా అనే పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్.

మొక్కలు నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం లాంచనంగా ప్రారంభించాం. ప్రపంచమే గ్రామంగా మారుతున్న వేళ పర్యావరణాన్ని కాపాడడానికి మొక్కలు నాటాలి.

మొక్కలు నాటడం కార్యక్రమంగా కాదు మన జీవితంలో భాగస్వామ్యం కావాలి.

హుస్నాబాద్ నియోజకవర్గం లో 280 మహిళా సంఘాలకు 13 రకాల వస్తువులు గవర్నర్ గారి చేత మీద స్టీల్ బ్యాంక్ పంపిణీ చేశాం.

500 హోటల్స్ కి గ్లాస్ లు పంపిణీ చేశాం.

ఈరోజు హుస్నాబాద్ మున్సిపాలిటీ ,సూర్యాపేట తో కలిసి అవార్డు తీసుకుంటుంది.

దిల్లీలో కాలుష్యంతో నివసించే పరిస్థితి లేదు.

తెలంగాణ లో అలాంటి పరిస్తితి రాకుండా ముఖ్యమంత్రి ఈవి పాలసీ తీసుకొచ్చారు.

దేశంలో ఎక్కడ లేని విధంగా సున్నా టాక్స్ అమలు చేస్తున్నాం.

మొక్కలు నాటడానికి అన్ని గ్రామాల్లో ఐదుగురు సభ్యులతో కమిటీ వేశాం. ప్రజలందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి. ఒకప్పుడు ఎక్కడ చూసినా పండ్ల మొక్కలు ఉండేవి..ఇప్పుడు లేకపోవడం వల్ల కోతులు గ్రామాల్లోకి వచ్చి ఇబ్బందులు పెడుతున్నాయి.

రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం..ప్రతి ఇంట్లో మొక్కలు నాటాలి. ఎక్కడ ప్రభుత్వం స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటాలి. ప్రభుత్వం గీతా కార్మికుల కోసం కాటమయ్య రక్షణ కవచాలు ఇచ్చేటప్పుడు తాటి చెట్లు ఈత చెట్లు నాటిస్తోంది.

గత సంవత్సరం అటెండర్ నుండి మొదలు జిల్లా కలెక్టర్ వరకు ఒకే రోజు మొక్కలు నాటారు.. అలాంటి కార్యక్రమం తీసుకోవాలి.

పర్యావరణాన్ని కాపాడడానికి ప్రకృతి రక్షించడానికి మనం పని చేయాలి.

పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేయడం కాదు పాటించాలి.

గ్రామాల్లో మొక్కలు నాటడం లో ఒక కాంపిటీషన్ క్రియేట్ చేయండి.. మంచిగా మొక్కలు నాటిన గ్రామాల్లో సర్పంచ్ లను అభినందించండి.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు ,జిల్లా కలెక్టర్ హైమావతి, సిపి రష్మీ పెరుమాళ్,అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మి కిరణ్ , జిల్లా డిఎఫ్ఓ పద్మజ రాణి పద్మజ రాణి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ధరిపల్లి చంద్రం, మర్పడగ గ్రామ సర్పంచ్ బాలరాజు. వివిధ విభాగాల అధికారులు, క్రాంతి స్కూల్ ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని విద్యార్థులు,ప్రజలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి ముందే జాతీయ రహదారి-65పై పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి-పటాన్చెరు మధ్య రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**

సంగారెడ్డి, జూన్ 5 మనం న్యూస్ ప్రతినిధి : జాతీయ రహదారి-65పై సంగారెడ్డి నుండి పటాన్చెరు వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ, నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు, వాటర్ లాగింగ్ పాయింట్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాల తరలింపు, నీటి పైప్లైన్ల షిఫ్టింగ్, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.





ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గత ఏడాది ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.




ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్ స్పాట్ల వద్ద తాత్కాలిక భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలపై స్లాబులు ఏర్పాటు చేసి మూసివేయాలని చెప్పారు. అవసరమైన చోట వాటర్ పైప్లైన్లను వెంటనే షిఫ్ట్ చేయడంతో పాటు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని జాతీయ రహదారి అధికారులకు సూచించారు.

రోడ్డు విస్తరణ పనులకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తరలించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించిన కలెక్టర్, యుటిలిటీల షిఫ్టింగ్ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అలాగే రోడ్డు విస్తరణకు ప్రభావితమవుతున్న నివాస భవనాల యజమానులకు పరిహారం చెల్లించి తొలగింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రహదారికి ఇరువైపులా ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా మున్సిపల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పెద్దాపూర్ పట్నం డాబా ఎదురుగా ఉన్న కల్వర్టును పరిశీలించిన కలెక్టర్, వర్షాకాలం సమీపిస్తున్న దృష్ట్యా కల్వర్టు వెంట్లను ముందుగానే శుభ్రపరిచి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్, ఆర్ అండ్ బీ అధికారులు, జాతీయ రహదారుల డీఈఈ రామకృష్ణ, ఈఈ శ్రవణ్ ప్రకాష్, జీఎం రమేష్, ఆర్కేసీపీఎల్ కాంట్రాక్టర్ జయప్రకాష్, సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్లు, డీఎస్పీలు, ఆర్డిఓ,తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్ను
# సద్వినియోగం చేసుకోండి





**హుస్నాబాద్ కోర్టు జడ్జిలు బి. రేవతి, ఈ. ప్రమిద పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కల నాటిన జడ్జిలు..**

హుస్నాబాద్, జూన్ 5 మనం న్యూస్: ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి. రేవతి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ. ప్రమిద పిలుపునిచ్చారు.

జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహణపై హుస్నాబాద్ కోర్టు ప్రాంగణంలో శుక్రవారం పోలీసు శాఖ అధికారులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బి. రేవతి మాట్లాడుతూ రాజీకి వీలున్న కాంపౌండబుల్ కేసులన్నింటినీ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకొని సమయం, ధనం ఆదా చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోర్టు ఆవరణలో జడ్జిలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జడ్జిలు సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిని మల్లేశం, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజశేఖర్ రెడ్డి, పీపీ ఎం.కె. నాగరాజ్, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి పోలీస్ స్టేషన్ల ఎస్సైలు పి. లక్ష్మారెడ్డి, పి. అభిలాష్, ప్రశాంత్, తిరుపతి, సీనియర్ న్యాయవాదులు ఒగ్గోజు సదానందం, కన్నోజు రామకృష్ణ, జె. కిరణ్ కుమార్, ఉప్పరపల్లి సంపత్, దీకొండ ప్రవీణ్, విశ్వతేజ్, సాయికుమార్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సిద్ధిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ సస్పెండ్

**- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో లోపాలు**
**- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్**

సిద్దిపేట రిపోర్టర్, జూన్05 మనం న్యూస్: జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో జరిగిన లోపాలపై జిల్లా కలెక్టర్ హైమావతి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో తగిన ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం జరిగినట్లు గుర్తించిన కలెక్టర్, ఈ విషయాన్ని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ టీ కే శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

అలాగే జిల్లా కలెక్టరేట్లో జరిగిన ప్రధాన ఉత్సవ కార్యక్రమానికి పలువురు శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై కూడా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కార్యక్రమానికి గైర్హాజరైన అధికారులపై విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. కలెక్టర్ నివేదిక ఆధారంగా స్పందించిన కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ టీ కే శ్రీదేవి, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ పరిణామం సిద్దిపేట జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో నిర్లక్ష్యానికి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందనే సందేశాన్ని ఈ చర్య స్పష్టం చేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



## ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలిత దేవి.**

సంగారెడ్డి జూన్ 5 మనం న్యూస్ ప్రతినిధి : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి అన్నారు శుక్రవారం నాడు సింగీతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాయికోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె అకాడమీ స్పీకర్ తనిఖీ చేసి హాజరు రిజిస్టర్ వైద్య రికార్డులను లేబర్ రూమ్ ప్రయోగశాల ల్యాబ్ నిర్వహణ సిబ్బంది హాజరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సమావేశమై ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజల కు అందుబాటులో ఉంటూ పూర్వకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించాలని తెలిపారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని ముందస్తు అనుమతి లేకుండా ఎవ్వరు సెలవులపై వెళ్లరాదని ఆదేశించారు అలాగే విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ ప్రజలకు మెరుగైన మరియు సమర్థవంతమైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు .



## శ్రీరామ్ తండా గ్రామ సభలో ప్రజా సమస్యలపై చర్చ

అక్కన్నపేట మండలం జూన్ 05మనం న్యూస్: అక్కన్నపేట మండలం శ్రీరామ్ తండా గ్రామపంచాయతీలో గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బానోతు వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పనపై విస్తృతంగా చర్చించారు.సభను ఉద్దేశించి మాట్లాడిన బానోతు వెంకటేష్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాలు, గ్రామాభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు.అదేవిధంగా ప్రజలు ప్రభుత్వ పథకాలను



సద్వినియోగం చేసుకోవడంతో పాటు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్తుల నుంచి వచ్చిన సమస్యలు, సూచనలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు.

గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను ప్రస్తావించగా వాటిపై సానుకూలంగా స్పందించిన బానోతు వెంకటేష్కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రెటరీ , గ్రామ మహిళలు, యువకులు, రైతులు, స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## నేడు దోమడుగులో వార్డు సభ

**మున్సిపల్ కమిషనర్: దశరథ్**

గుమ్మడిదల ( మనం న్యూస్ ) జూన్ 5 : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధి దోమడుగులోని వార్డు కార్యాలయంలో 3,9,18,19 వార్డులకు దోమడుగు వార్డు కార్యాలయంలో వార్డు సభ నిర్వహించడం జరుగుతుందని గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశం 10 గంటలకి ప్రారంభమవుతుందని సకాలంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ మరియు వార్డ్ కౌన్సిలర్లు హాజరు కావలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. సంబంధిత శాఖ అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆయన సూచించారు.



## విద్యాధరి క్షేత్రంలో శారద స్మార్త వేద విద్యాలయ ప్రవేశ పరీక్షలు

### వైభవంగా కృత్తిక నక్షత్ర మహోత్సవం

వర్గల్ జూన్5మనం న్యూస్:ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యా సరస్వతి క్షేత్రానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీ శారద స్మార్త వేద విద్యాలయ ప్రవేశానికి శుక్రవారం పరీక్షలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద గురువులు ఆచార్య అభిరాం శర్మ, వేద విద్యాలయ అధ్యక్షులు గుండేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షలు నిర్వహించి చక్కటి ప్రతిభ కనబరిచిన 22 మంది విద్యార్థులను ఎంపిక చేసి వేద విద్య అభ్యసనానికి అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు దాచేపల్లి వెంకట కృష్ణారావు, వేద పాఠశాల కార్యదర్శి రేణికుంట శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు. అలాగే కృత్తికా నక్షత్ర మహోత్సవం సందర్భంగా వేద పండితుల మంత్రోశ్చరణలు, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరగగా, విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.



## మొక్కలు నాటుదాం కాలుష్యాన్ని నివారిద్దాం

### సర్పంచ్ పావని మోహన్ రెడ్డి

వర్గల్ జూన్ 5 మనం న్యూస్: మొక్కలు విరివిగా నాటి కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని షేర్ పల్లి సర్పంచ్ పావని మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ అధ్యక్షతన వార్డు సభ్యులతో కలిసి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెట్ల పెంపకంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరు చెట్లు నాటి వాటి పరిరక్షణ చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామంలో తడి పొడి చెత్తను వేరుచేసి గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం గత 5 సంవత్సరాలుగా గ్రామానికి సెక్రటరీగా సేవలందించి బదిలీపై వెళ్లిన హసేన్ మీరన్ ను శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. అలాగే నూతన సెక్రటరీగా నియమితులైన భాగ్యరెడ్డిని శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో విలేజ్ సెక్రెటరీ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం




నారాయణఖేడ్, జూన్ 5 మనం న్యూస్ ప్రతినిధి:-- ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) సంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయ సంయుక్తంగా నారాయణఖేడ్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వృక్షారోపణను ప్రోత్సహించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా నిర్వహించబడింది

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రజలు ఎకో పార్కును సద్వినియోగం చేసుకోవడంతో పాటు పచ్చదనాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, అటవీ సంపద పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వృక్షారోపణ కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు.

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని ప్రజలకు సూచించారు.

ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శన స్టాల్ను ఏర్పాటు చేశారు. ఇందులో కాగితంతో తయారైన ఉత్పత్తులు, పునర్వినియోగ పదార్థాలు, స్టీల్ వాటర్ బాటిళ్లు, లంచ్ బాక్సులు, పేపర్, క్లాత్, జనపనార (జూట్) సంచులు, చెక్కతో తయారైన స్పూన్లు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రదర్శించారు. రోజువారీ జీవితంలో వీటి వినియోగం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు.

అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను అధికారులు, ప్రజలతో చేయించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించడం, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం కోసం కృషి చేయడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లాలోని వరుణ్ బేవరేజెస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎద్దుమైలారం ఓడీఎఫ్ స్థలం, పాశమైలారం జేకే ఫెన్నర్ సంస్థలలో నిర్వహించిన వృక్షారోపణ కార్యక్రమాల్లో కూడా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు ప్రజలను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే స్థిరమైన జీవన విధానాలను అలవరచుకోవాలని విజ్ఞప్తి చేశారు.





## రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగం కార్యదర్శులుగా హేమలత, విజయలక్ష్మి

### హర్షం వ్యక్తం చేసిన హుస్నాబాద్ ఆర్యవైశ్యులు...

హుస్నాబాద్ జూన్ 5 మనం న్యూస్: తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగం కార్యదర్శులుగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణానికి చెందిన మాడిశెట్టి హేమలత, నార్ల విజయలక్ష్మి ఎన్నిక కావడం పట్ల జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చొల్లేటి లత, హుస్నాబాద్ ఆర్య వైశ్య యువజన విభాగం అధ్యక్షుడు కంభంపాటి సందీప్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన హేమలత, విజయలక్ష్మి ఆర్య వైశ్యుల సంక్షేమం, సంఘం అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో మహిళా విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ, సంఘం చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ముందుండాలని సూచించారు. వీరిరువురు తమ పదవీకాలంలో సేవా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాల ద్వారా ఆర్య వైశ్య సమాజానికి మరింత గుర్తింపు తీసుకురావాలని కోరుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే నూతన బాధ్యతలు చేపట్టిన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## భూముల మార్కెట్ విలువ అమాంతం పెంచడం దారుణం

### బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, సి జి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి.

గుమ్మడిదల ( మనం న్యూస్ ) జూన్ 5 : రాష్ట్ర ప్రభుత్వం భూముల మార్కెట్ విలువ అమాంతం పెంచడం దారుణమని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, సి జి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు తన కార్యాలయంలోని మాట్లాడుతూ భూముల ధరలు విపరీతంగా పెంచడం వలన ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పు పట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూములు మార్కెట్ విలువ 25 శాతం నుండి 100% వరకు పెంచడం సరికాదన్నారు. గత 10 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఒక్కసారిగా

భారీగా పంచడం ప్రజలకు ఇబ్బందులు గురి చేయడమేనని విమర్శించారు. భూములు క్రయవిక్రయాల వలన రిజిస్ట్రేషన్ లపై కూడా పెను భారం పడుతుందని పేద మధ్యతరగతి ప్రజలు సొంత ఇంటి కల నెరవేర్చుకోవడం కష్టతరమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల అవసరాలు పక్కనపెట్టి ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోవడం మంచిది కాదని ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన సూచించారు. భూముల మార్కెట్ విలువ పెంపు నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.



# పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం...






### తెలంగాణ అవమానాన్ని సహించబోం ...

### హుస్నాబాద్ జేఏసీ నేతలు

హుస్నాబాద్, జూన్ 5 మనం న్యూస్: హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ ప్రజలు, తెలంగాణ ఉద్యమాలను అవమానించేలా బీజేపీతో అటు వాటి అనుబంధ సంఘాల నాయకులు వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించదగ్గవని అన్నారు.

సీపీఐ రాష్ట్ర నాయకులు గడిపె మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ ద్రోహులు రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాకవి గద్దర్ను అవమానించే వ్యాఖ్యలను తెలంగాణ సమాజం సహించదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్ గాదెపాక రవీందర్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సీమాంధ్ర పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం నడిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఇటువంటి కుట్రలను తిప్పికొడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు మేకల వీరన్న యాదవ్, డ్యాగల సారయ్య, కోహెడ కొమురయ్య, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, నాంపల్లి సమ్మయ్య, మండల జంపన్న, చెప్యాల ప్రకాశ్, వేముల జగదీశ్, తొందూరి ఎల్లయ్య, జంగ విజయ, గూడ పద్మ, అక్బర్, పెట్టెం కుమారస్వామి, కొంగల రాంచంద్రరెడ్డి, రమేష్ యాదవ్, యాదగిరి, మాట్ల వెంకటస్వామి, కండె సుధాకర్, పొన్నాల వినోద్, ఎదులాపురం తిరుపతి, బసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, లింగచారి, ఐలయ్య, భిక్షపతి, నిర్మల, మ్యాక రమేష్, మ్యాకల సమ్మయ్య, దుర్గం రవీందర్, లింగమూర్తి, రామక్క తదితరులు పాల్గొన్నారు.

---

## రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టాలి





### నియుజకవర్గం గులాబీ మయం కావాలి

### పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదుపై దిశానిర్దేశం

### సభ్యత్వ నమోదు నియుజకవర్గ ఇంచార్జ్ పట్నం మాణిక్యం

మనం న్యూస్ వట్పల్లి మే 05:- వట్పల్లి మండల కేంద్రంలోని గురుకృప ఫంక్షన్ హాల్లో ఆందోల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ఓటరు జాబితా సవరణ పై శుక్రవారం నాడు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సభ్యత్వ నమోదు కార్యమానికి ముఖ్య అతిథిగా నియుజకవర్గ ఇంచార్జ్ పట్నం మాణిక్యం పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి రక్షణ కవచంగా నిలబడే ఏకైక పార్టీ బిఆర్ఎస్ మాత్రమేనన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి విస్తృతంగా చేపట్టి ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని అన్నారు.

అలాగే అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలోని లోపాలను గుర్తించి సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, పార్టీ మనోభావాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ క్రియాశీలక సభ్యత్వాలను పెంచాలని, ప్రతి మండలంలో నాయకులు పోటాపోటీగా సభ్యత్వాలు నమోదు చేయాలని నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను బూత్ ఇంచార్జీల ఆధ్వర్యంలో పకడ్బందీగా నడిపిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, మండల నాయకులు వీరారెడ్డి, శివాజీరావు, వెంకట్ రెడ్డి, బుద్ధిరెడ్డి, అశోక్ గౌడ్, నర్సింలు, రామన్న, మధు, శ్రీనివాస్ గౌడ్, ప్రకాష్, వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ తదితరులు పాల్గొన్నారు.

---

## పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలి

### న్యూ ల్యాండ్ లేబరేటరీ ఇంచార్జ్ : రమేష్ బాబు.

గుమ్మడిదల ( మనం న్యూస్ ) జూన్ 5 : పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు పరిరక్షించాలని న్యూ లాండ్ లాబరేటరీ ప్లాంట్ ఇంచార్జ్ రమేష్ బాబు కోరారు. శుక్రవారం నాడు ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా పరిశ్రమ కార్మికులతో కలిసి న్యూ లాండ్ లాబరేటరీ పరిశ్రమ నుండి బొంతపల్లి కమాన్ వరకు మొక్కలు నాటించారు. కార్మికులంతా కలిసి ప్రధాన రహదారిలో మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



---



## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి సర్పంచ్ ఎంగే నరేష్

నంగునూరు, జూన్ 05 మనం న్యూస్ :- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గట్లమల్యాల గ్రామంలో శుక్రవారం సర్పంచ్ ఎంగే నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిసరాల్లో వివిధ రకాల నీడనిచ్చే, ఫలవృక్ష మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎంగే నరేష్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెద్ద చెట్లుగా పెంచే బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు.

పంచాయతీ కార్యదర్శి అనిల్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం అవసరమన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామంలోని ఖాళీ ప్రదేశాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రంగు లక్ష్మి, మంగళారపు స్వరూప, మంగళారపు రమ, నోముల రవీందర్, లోకటి సత్తయ్య, బత్తుల కనకయ్య, ఉపాధ్యాయులు అశోక్, లింగం, రాములు, అఫ్రజ్, దత్తాత్రేయ, విజయ్ కుమార్, రామస్వామి, అంగన్వాడీ టీచర్లు అనుమాస్ రమ, నిర్మల, సీఏలు రేణుక, లక్ష్మి, కారోబార్ రవీందర్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామస్తులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.



# ప్రపంచ పర్యావరణ దినోత్సవం

## గాంధీనగర్లో మొక్కలు నాటడం జరిగింది

హుస్నాబాద్ జూన్ 5 మనం న్యూస్: ప్లాస్టిక్ రహిత గ్రామసర్పంచ్ పోలుసంపత్ మాట్లాడుతూ మన గాంధీనగర్ను తీర్చిదిద్దుదాం. ప్లాస్టిక్కు దూరంగా ఉంటూ, పర్యావరణాన్ని కాపాడుకుందాం. మన బాధ్యతను గుర్తిద్దాం - ప్లాస్టిక్ రహిత గాంధీనగర్ వైపు అడుగులు వేద్దాం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యదర్శి శ్రేయ, అంగన్వాడి టీచర్ లక్ష్మి, ఆశా కార్యకర్త లత, వివో మంచాల రేణుక, సి ఎ పెసర అపర్ణ, వార్డు సభ్యులు మెదని ఆంజనేయులు, చెంచు సంపత్, గంటల సంపత్, టి రేణుక, పి మమత, గ్రామస్తులు ప్లాస్టిక్ రహిత గ్రామంగా పర్యావరణం రక్షించుకుందామని మన అందరి బాధ్యత అని గాంధీనగర్ గ్రామస్తులు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన సీనియర్, జూనియర్ సివిల్ జడ్జీలు



జహీరాబాద్ జూన్ 5 మనం న్యూస్: జహీరాబాద్ పట్టణం సుభాష్ గంజ్ లోని కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జీ, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి కవిత దేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ మొహమ్మద్ అబ్దుల్ ఖలీల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ బ్లెస్సీ, కోర్టు సిబ్బంది, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డిలు మొక్కలు నాటడం జరిగింది. శుక్రవారంనాడు అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పునస్కరించుకుని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జహీరాబాద్ వారి ఆధ్వర్యంలో వారు ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం వలన స్వచ్ఛమైన గాలితో పాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించడం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతిఒక్కరు విధిగా మొక్కలను నాటి పర్యావరణ సమతుల్యతలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు సోమశేఖర్, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రయివేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

**- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి**

**ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ వై నరోత్తం డిమాండు**



జహీరాబాద్ జూన్ 5 మనం న్యూస్: తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద ప్రయివేటు విద్యాసంస్థలు విద్య పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్నాయని ఎస్సీ కార్పోరేషన్ రాష్ట్ర మాజీ ఛైర్మన్ వై నరోత్తం ఆరోపించారు. ఈ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల ఆగడాలను అరికట్టాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తూ కార్పోరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలకడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆయన నిశితంగా విమర్శించారు. శుక్రవారంనాడు వై నరోత్తం ఇందుకు సంబంధించిన ఓ పత్రిక ప్రకటనను స్థానిక పత్రికల వారికీ విడుదల చేశారు.

జహీరాబాద్ నియోజకవర్గంలో సుమారు 280 ప్రభుత్వ పాఠశాలలు, 92 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయని, విద్యార్థుల సంఖ్య మాత్రం ప్రయివేటు పాఠశాలల్లోనే అధికంగా ఉండటం ఆందోళన కలిగించే విషయమని ఆయన గుర్తు చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు,ప్రభుత్వ సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ తల్లిదండ్రులు అధిక ఫీజులు చెల్లించి తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నర్సరీ స్థాయి నుంచే 50వేల రూపాయల నుండి 60 వేల రూపాయల వరకు,1 నుండి 5వ తరగతి వరకు 60వేల నుండి 70వేల వరకు, ఉన్నత తరగతులకు ఇంకా ఎక్కువ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన వివరించారు. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫామ్,రవాణా,ఇతర పేర్లతో అదనపు భారాన్ని తల్లి, దండ్రులపై మోపుతున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వైపు రైతులు, కూలీలు, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు,మరోవైపు పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన చెప్పారు.విద్య హక్కు కావాలి కానీ విద్య వ్యాపారంగా మారకూడదని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే ఈ ప్రయివేటు పాఠశాలలపై చర్యలు చేపట్టాలని కోరారు. ప్రయివేటు పాఠశాలల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక నియంత్రణ అథారిటీ ఏర్పాటు చేయాలని, ప్రతి పాఠశాల ఫీజుల పట్టిక ప్రజలకు వెల్లడించేలా ఆదేశాలు జారీ చేయాలని ఆయన సూచించారు.

అనుమతి లేని అదనపు వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని,

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య, డిజిటల్ తరగతి గదులు,మెరుగైన ఫలితాలు సాధించే కార్యక్ర మాలను అమలు చేయాలని,ప్రతి జిల్లాలో తల్లిదండ్రుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని,

ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం పెరిగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అర్హతలు మెరుగ్గా ఉన్నప్పటికీ సరైన తరగతి గదులు,తరగతులకు సరిపడ ఉపాద్యాయులు, ఇతర సదుపాయాలు,సరిగ్గా లేక,విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గ చూపడం ప్రభుత్వ విద్యా వ్యవస్థకు ఇది హెచ్చరికగా భావించాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం దీన్ని సీరియస్గా తీసుకుని ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని ఆయన డిమాండు చేశారు.

# ఏక్ పేడ్ మా కే నామ్ పేరిట మొక్కలు నాటిన బీజేపీ నేతలు





జహీరాబాద్ జూన్ 5 మనం న్యూస్: ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) పేరిట జహీరాబాద్ ప్రాంత బీజేపీ నాయకులు విస్తారంగా మొక్కలు నాటారు. శుక్రవారంనాడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సంద ర్భంగా భారత దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు వివిధ ప్రాంతాల ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం జరిగింది. జహీరాబాద్ పట్టణ బిజెపి అధ్యక్షులు పూల సంతోష్ నేత ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్యానగర్ గణేష్ మందిరం ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్త రాలకు స్వచ్ఛమైన వాతావర ణాన్ని అందించవచ్చని పేర్కొ న్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, ప్రకృతి సంరక్షణలో భాగస్వాములు కావాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాజ్ జగన్నాథ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్, రాష్ట్ర నాయకులు ఎం శ్రీనివాస్ గౌడ్, సుభాష్ రెడ్డి, సుధీర్ బండారి, అరుణ కౌళాస్, కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, సోమ అనిల్ కుమార్, పార్టీ నాయకులు శ్రీనివాస్ గుప్తా, అల్లాడి బక్కయ్య గుప్తా, పాలింకర్ సంతోష్, మారయ్య, బండి వెంకట్, అప్పం రమేష్, శివ, పూజ, శ్రీకాంత్, బసవరాజ్, అఖిలేష్ యాదవ్, మొహమ్మద్ అఫ్సర్ దిల్ దార్, అనిరుథ్ రెడ్డి, నరేష్ పాటిల్,సురేష్ పూరి, పూడి మహేష్ ముదిరాజ్, కుసుమ వైష్ణవి, నందు స్వామి, వెంకట్, శివరాజ్, తదితరులు పాల్గొ న్నారు.

# నాచగిరి క్షేత్రంలో జలప్రసాద మినరల్ ప్లాంట్ ఏర్పాటు

వర్గల్ జూన్ 5 మనం న్యూస్: నాచగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం వద్ద భక్తుల దాహార్తి తీర్చేందుకు నూతనంగా నిర్మించిన మినరల్ ప్లాంటు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, ప్రముఖ జ్యోతిష్యులు పరంకుశం వేణు స్వామి సౌజన్యంతో ఏర్పాటు చేసిన జల ప్రసాద మినరల్ ప్లాంటును శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్ గుప్తా, కార్యనిర్వాహణాధికారి రంగాచారి, ధర్మకర్తల మండలి సభ్యులు కిష్టయ్యా, పద్మ ,నాగరాజు, కొత్తపల్లి శ్రీనివాస్, నాయకం శ్రీనివాస్, రాజశేఖర్ శర్మ రాజశేఖర్ అర్చకులు సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్, బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదుపై పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం

జహీరాబాద్ జూన్ 5 మనం న్యూస్: జహీరాబాద్ పట్టణంలోని సుభాష్ గంజ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు ఆధ్వర్యం లో ఎస్ఐఆర్, బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదుపై పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. డిజిటల్ పద్ధతిలో బీఆర్ఎస్ పార్టీ మెంబర్షిప్ కార్యక్రమాన్ని ఈ నెలలోనే ప్రారంభిస్తారని ఎమ్మెల్యే మాణిక్ రావు తెలిపారు.బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదుతోపాటు ఎస్ఐఆర్ పై నిర్వహించిన ఈ సన్నాహక సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ (సభ్యత్వ( నమోదు కార్యక్రమంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమాల అమలు విధానం గురించి ఎమ్మెల్యే జహీరాబాద్ ప్రాంత నాయకులకు, పార్టీ కార్యకర్తలకు,





బూత్ స్థాయి ఇంచార్జీలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్య క్రమంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్లు గుండప్ప, రామకృష్ణారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ జి విజయ్ కుమార్,జహీరాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ యాదవ్ కురుమ, ఝరాసంగం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశం,కోహీర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నర్సిములు, న్యాల్ కల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్, జహీరాబాద్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ మొహమ్మద్ తంజీమ్ అహ్మద్, పలు గ్రామాల సర్పంచులు , మాజి సర్పంచులు,ముఖ్య నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు..

హుస్నాబాద్ జూన్ 5 మనం న్యూస్: హైదరాబాద్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హుస్నాబాద్ పురపాలక సంఘం ప్రతిష్టాత్మక బెస్ట్ మున్సిపాలిటీ ఇన్ వేస్ట్ మేనేజ్మెంట్ అవార్డును అందుకుంది. క్లైమేట్ యాక్షన్ థీమ్తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా హుస్నాబాద్ పురపాలక సంఘ చైర్పర్సన్ దండి లక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, పర్యావరణ అధికారి రవికుమార్ అవార్డును స్వీకరించారు.పట్టణంలో ఘన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ చర్యలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణలో చూపిన ప్రతిభకు




గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అవార్డు అందుకోవడం హుస్నాబాద్ పట్టణానికి గర్వకారణమని, భవిష్యత్తులో మరింత మెరుగైన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేపడతామని అధికారులు తెలిపారు.

# మాజీ సర్పంచి మొల్లయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే కేఎంఆర్

జహీరాబాద్ జూన్ 5 మనం న్యూస్: కోహిర్ మండలం పైడిగుమ్మల్ గ్రామ మాజీ సర్పంచి మొల్లయ్యను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పరామర్శించారు. కొద్దీ రోజుల క్రితం మొల్లయ్య ప్రమాదవశాత్తు జారి కింద పడి కాలుకు గాయమై ఆసుపత్రిలో (ఆపరేషన్) చికిత్స పొందిన విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మనణిక్ రావు తన అనుచరులతో కలిసి నేరుగా అతని ఇంటికెళ్ళి పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పి. రామకృష్ణారెడ్డి, కోహిర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నర్సిములు, పార్టీ నాయకులు రాజశేఖర్ (వెంకటాపూర్ మాజీ సర్పంచి) జిల్లా పార్టీ నాయకుడు ఆనంద్, ఎమ్మెల్యే తనయుడు నితిన్ రాజ్, సీనియర్ పార్టీ నాయకుడు శివప్ప, పార్టీ నాయకులతో కలిసి గ్రామానికి వెళ్లి వారిని పరామర్శించి, అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ కార్యకర్తలు ఏసయ్య, డప్పు నర్సిములు, మొగులయ్య, అనిల్, ఎం లక్ష్మయ్య, యాదయ్య, వెంకయ్య, రవి, తదితరులు ఉన్నారు.





# నర్మెటలో బోర్ పట్టీల దొంగతనం

**రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు**

నంగునూరు, జూన్ 05 మనం న్యూస్:- సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలోబోరు మోటార్ల పట్టీలను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లుతున్నారు. దీంతో బోర్ మోటార్ల వాడా రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టీల నుంచి మోటార్లు ఊడి బోరుబావిలో పడి ఇరుక్కు పోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. నర్మెటకు చెందిన మంకాల రాజు, గంధమల్ల లింగం, గందమల్ల కనకయ్య అనే ముగ్గురు రైతులు కలసి అప్పలాయ చెరువు రోడ్డులో లింగంపట్ల బాయి పక్కన బోర్లు వేసి, వాటిలో మోటార్లు బిగించి ఇరవై సంవత్సరాల నుంచి పంటలు సాగు చేస్తున్నారు. ఈ బోరుల మోటార్ల పైపట్టిలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇంకొక పట్టి కూడా తీస్తే బోరు మోటార్ బోరు బాయిలో పడి పోయేది. బోర్ మోటార్ బోరు బావిలో పడిపోతే తమ వ్యవసాయం కుంటుపడేదని మంకాల రాజు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



నంగునూరు, జూన్ 05 మనం న్యూస్:- సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోపర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ నాయకులు పిలుపు ఇచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన ఏక్ పేడ్ మాకే నామ్ అమ్మ పేరుతో ఒక మొక్క పిలుపు మేరకు మండల కేంద్రమైన నంగునూరు లో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటి కాపాడడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు మొక్కలను నాటినట్లు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు చౌడుచర్ల వెంకట్రామిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతి రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు జీడిపల్లి రజనీకర్ రెడ్డి, గంధం పరమేశ్వర రెడ్డి, కోల సతీశ్ గౌడ్ తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి మానవాళి మనుగడ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.